నేడు విద్యాసంస్థల బంద్‌కు సహకరించాలి

విశాలాంధ్ర-మంగళగిరి : నీట్ పరీక్ష పేపర్ లీకేజీ నిరసిస్తూ ఈ నెల 4వ తేదీన విద్యార్థి సంఘాలు ఆధ్వర్యంలో తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ని జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని అన్ని స్కూల్స్, కాలేజీల, ప్రిన్సిపాల్‌కు బుధవారం విద్యా సంస్థల బంద్‌కు సహకరించాలని బంద్ నోటీసులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పరీక్ష నిర్వహణలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటాలు ఆడుతూ విద్యార్థుల భవిష్యత్తులను శూన్యం చేస్తున్నారని మండిపడ్డారు. నీట్ స్కాంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బంద్ నోటీసులు అందించిన వారిలో ఏఐఎస్ఎఫ్ మంగళగిరి నియోజకవర్గ కన్వీనర్ యార్లగడ్డ శివ గోపి, కో కన్వీనర్ మత్తె అభిషేక్, పట్టణ అధ్యక్షుడు ఆళ్ళమూడి హానోక్ బాబు, ఎం.మణికంత, సిహెచ్ ధర్మ తేజ, యార్లగడ్డ మణికంత తదితరులు ఉన్నారు.

బీసీ సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంక్షేమ శాఖ నిర్వహిఁచుచున్న హాస్టల్స్ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్కూల్ స్థాయి నుంచి కాలేజీ వరకు విద్యార్థులు మెస్ చార్జీలు సరిపోక, ప్రభుత్వం ఇస్తున్న మెస్ చార్జీల మెనుకు సరిపోక చాలా ఇబ్బందిపడుతున్నారని, నిర్వాహకులు కూడా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు లేకపోవడంతో నిర్వహించలేక పోతున్నారని ఆయన విన్నవించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్న వరపు నాగమల్లేశ్వరరావు, యువజన రాష్ట్ర అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగుల శ్రీనివాస్, యువజన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పాల రాజ్ కిరణ్, గేదెల సూర్యప్రకాష్ తదితరులు పాల్గొని సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల సమస్యలపై ప్రసంగించారు.

2011 చట్టాన్ని అమలుపరచాలి

విశాలాంధ్ర-దుగ్గిరాల : ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం దుగ్గిరాల మండల చిలువూరు కమిటీ కౌలు రైతులు ఆర్‌బీకే కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి శిరీషకు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని మెమో రాండం ఇవ్వడం జరిగింది. కౌలు రైతుల సంఘం మండల కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కౌలు రైతులకు తెచ్చిన 2019 చట్టాన్ని రద్దుచేసి 2011 చట్టం భూ ఆదికృత రైతుల చట్టం అమలు చేయాలన్నారు. అలాగే రాష్ట్రంలో 80 శాతం కౌలు రైతులు సన్న, చిన్నకారు రైతులు సాగు చేస్తున్నారు. కౌలు రైతులను గుర్తించి దరఖాస్తులు స్వీకరించి కౌలుకార్డులు గ్రామ రెవెన్యూ అధికారులు, మండల వ్యవసాయశాఖ అధికారులు, తహసీల్దార్ నివృత్తి చేసి కౌలు రైతు కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు బి.అమ్మిరెడ్డి, జె.పాల్ నరసింహారావు పాల్గొన్నారు.

ఘనంగా మెకానిక్‌ల దినోత్సవం

విశాలాంధ్ర-మంగళగిరి : టు వీలర్స్ మెకానిక్‌లను అసంఘటిత కార్మికులలో చేర్చాలని, చంద్రన్న బీమా వర్తింపజేయాలని శ్రామిక టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ మంగళగిరి రాష్ట్ర ప్రభు త్వం విజ్ఞప్తి చేసింది. టూ వీలర్స్ మెకానిక్స్ దినోత్సవం సందర్భంగా శ్రామిక టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరి నగరంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించి, షాదీఖానా లో సభ జరిగింది. ఆ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ మెకాని క్‌లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, మా యూనియన్ సమావేశాల నిర్వహణకు కమ్యూనిటీ నిర్మించుకునేందుకు పదిసెంట్లు స్థలాన్ని కేటా యించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తిచేశారు. లేబర్ ఆఫీసర్ మూర్తి, ఆనంద్ టూ వీలర్స్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆసిఫ్ అలీ, మంగళగిరి యూనియన్ గౌరవాధ్యక్షులు షేక్ సలీం, సుబ్బారావు, పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది అభినందనీయం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్‌లో వర్షాకాలంలో రోడ్డు ప్రమాదాలు జరగ కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్టీసీ డ్రైవర్లకు సూచనలు చేస్తూ ఆర్టీసీ రూపొందించిన కరపత్రా లను ఆవిష్కరించారు. బస్‌స్టేషన్‌కు బుధవారం సాధారణ తనిఖీలో భాగంగా వచ్చిన ఆర్టీసీ జిల్లా రీజి యన్ మేనేజర్ ఎం.రవికాంత్ ద్వారా కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లా దారు. మంగళగిరి ఆర్టీసీ డిపోలో 2023-24 సంవత్సరానికి ఎటు వంటి యాక్సిడెంట్లు లేకుండా జీరో యాక్సిడెంట్‌గా నమోదైందన్నారు. డిపోలోని డ్రైవర్స్, కండక్టర్స్ మెకానిక్ సిబ్బంది కృషి అభినందనీయ మన్నారు. ప్రమాదాలు జరగకుండా చూడవలసిన బాధ్యత ఆర్టీసీపై ఉందన్నారు. డ్రైవర్స్ ఎంతో బాధ్యతాయుతంగా డ్యూటీలు చేయడం వలన ప్రమాదాలు నివారించగలిగామన్నారు. ఆర్టీసీకి ప్రయాణికులే బలమని, ప్రయాణికులు లేనిదే ఆర్టీసీ లేదన్నారు. ప్రయాణికులతో డ్రైవర్లు, కండక్టర్లు సమన్వయంతో ఉండి ఆర్టీసీకి మంచి పేరు తీసుకు రావాలన్నారు. డిపోలో ప్రస్తుతం 31 షెడ్యూల్ తిప్పుతున్నామన్నారు. 22 పల్లె వెలుగులు, ఐదు సూపర్ లగ్జరీలు, రెండు ఆల్ఫా డీలక్స్‌లు, రెండు ఎక్స్‌ప్రెస్‌లు తిరుగుతున్నాయని చెప్పారు.

భరత్‌పై చర్యలు

విశాలాంధ్ర-తాడేపల్లి : గత రాత్రి బుజ్జి అనే యువకుడిపై అకారణంగా విచక్షణా రహితంగా భరత్ అనే వ్యక్తి కత్తితో దాడికి పాల్పడ్డాడు ధైర్యం చేసి బుజ్జి పోలీస్ స్టేషన్‌కు రావడంతో ఒక్కొక్కరుగా బాధితులు బయటకు వస్తున్నారు. కొద్దిరోజుల క్రితం నడిరోడ్డుపై ఓ యువతిపై గంజాయి మత్తులో భరత్ కింద పడేసి కాళ్ళతో పీకమీద కాలు వేసి తొక్కాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని యువతి ఆవేదన వ్యక్తం చేసింది. గతంలోనే భరత్‌పై కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదంటూ స్థానిక మహిళల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భరత్ నుంచి తమకు రక్షణ కల్పించాలని, తమ ప్రాంతంలో ప్రశాంత వాతావరణం కావాలని మంత్రి నారా లోకేష్‌ను మహిళలు, బాధితులు కలవనున్నట్లు తెలిపారు. భరత్ పరారీలో ఉన్నాడు. తాడేపల్లి పోలీసులు గాలిస్తున్నారు.

వైద్య సేవలు అందించాలి : కలెక్టర్

- ప్రైమరీ హెల్త్ సెంటర్ తనిఖీలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ

విశాలాంధ్ర-గుంటూరు : వైద్య చికిత్స కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు ప్రభుత్వ ఉచిత వైద్య సేవలు అన్ని సజావుగా అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ వైద్యాధికారులకు సూచించారు. చేబ్రోలు ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని జనరల్ వార్డు, లేబర్ వార్డు, ల్యాబ్ పరీక్షలు నిర్వహించే గదులను పరిశీలించారు. ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు సంబంధించిన అన్ని రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. అన్ని విభాగాలకు సంబంధించిన వివరాలతో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను నిర్వహించేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో ఆరోగ్య పరీక్షలు అన్ని కూడా రోగులకు ఉచితంగా అందించాల న్నారు. ఎటువంటి పరిస్థితుల్లో కూడా రోగులకు బయట పరీక్షలు చేయించరాదని హెచ్చరించారు. గర్భిణీలకు సంబంధించిన హై రిస్క్ కేసులను ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి సజావుగా కాన్పులు జరిగేటట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎటువంటి పరిస్థితుల్లో కూడా మెటర్నల్ డెత్స్ జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమాన్ని పకడ్బంధీగా చేపట్టాలన్నారు. అలాగే నీరు కలుషితం వల్ల వచ్చే వ్యాధులను కీటకజనీత వ్యాధులను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైమరీ హెల్త్‌కు చికిత్స నిమిత్తం వచ్చిన రోగులతో ఇక్కడ అందు తున్న వైద్య సేవలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకు న్నారు. వైద్య సిబ్బంది కానీ, వైద్య అధికారులు కానీ వైద్యానికి డబ్బులు అడుగుతున్నారా అని వారిని ప్రశ్నించారు. అక్కడ ఉన్న రోగులు అలాంటిది ఏమి లేదని వైద్యం సరిగా అందుతున్నదని తెలుపుతూ రాత్రి పూట వైద్య సిబ్బంది అందుబాటులో లేకుండా ఉండడం వలన కొంత ఇబ్బంది ఉందని కలెక్టర్‌కు తెలిపారు. రాత్రి పూట నర్స్, హెడ్ నర్స్ ఆరోగ్య కేంద్రంలో తప్పక అందుబాటులో ఉండాలని తెలుపుతూ అవసరమైన పక్షంలో మెడికల్ డాక్టర్‌కు వాకబు చేసి వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంచి మౌలిక సదుపాయాలతో పాటు డాక్టర్లు, సిబ్బంది, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నందున పీహెచ్‌సీ పరిధిలో అన్ని పారామీటర్స్‌లో మెరుగుదల సాధించవచ్చని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ తల్లి బిడ్డ ఆరోగ్య సేవలు, ఇమ్యునైజేషన్ కార్యక్రమాలపై మరింత శ్రద్ధ పెట్టాలని వైద్యాధికారులకు సూచించడం జరిగిందని తెలిపారు. వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాలు, నీటి కాలుష్యం వల్ల వచ్చే జబ్బులు, డెంగ్యూ, మలేరియా వంటి కేసులు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ అన్నపూర్ణ, మెడికల్ అధికారులు అబ్రహం లింకన్, శైలజ, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, గ్రౌండ్ వాటర్ డీడీ వందనం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు భారీగా తరలివస్తున్న ప్రజలు

విశాలాంధ్ర-తాడేపల్లి : కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలుస్తున్నారు విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్. మంగళగిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ప్రజలు 'ప్రజా దర్బార్'కు తరలివచ్చి తమ సమస్య లను విన్నవిస్తున్నారు. ఉదయం నుంచే ఉండవల్లి నివాసం వద్ద వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, యువత, ఉద్యో గులు, వివిధ సంఘాల ప్రతి నిధులు బారులు తీరుతు న్నారు. నేరుగా యువనేతను కలిసి తమ కష్టాలను ఏకరవు పెడుతు న్నారు. ప్రతిఒక్కరి వద్ద విజ్ఞాపన పత్రాలు స్వీకరించి, ఆయా సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని మంత్రి వారికి భరోసా ఇస్తున్నారు. ఆయా సమస్యలను విభాగాల వారీగా విభజి ంచి సంబంధిత శాఖలకు పంపాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. దివ్యాంగులకు గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన టిడ్కో ఇళ్ల రుణాన్ని మాఫీ చేసి ఆదుకోవాలని ఆశయ సాధన దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

ఐదుగురు నిందితుల అరెస్ట్

- వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలింపు
- కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపిన మంగళగిరి రూరల్ పోలీసులు

విశాలాంధ్ర-మంగళగిరి : గత వైసీపీ ప్రభుత్వ ంలో మంగళగిరి నగరంలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు ముట్ట డించి, దాడి చేసిన కేసులోని ఐదుగురు నిందితులను గుర్తించి మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళగిరి రూరల్ పోలీసులు టీడీపీ కార్యాలయంపై వైసీపీ నాయకులు చేసిన ముట్టడి, దాడి చేసిన సంఘటనపై కేసులు నమోదు చేశారు. ఈ మేరకు ఆ కేసులోని నిందితులైన ఏ.వెంకటరెడ్డి, ఎస్‌కే మస్తాన్ వలీ, బి.దేవా నంద్, జి.రాంబాబు, ఎస్‌కే ఖాజా మొహిద్దిన్‌లను అరెస్ట్ చేశారు. కాగా అరెస్ట్ చేసిన వారిని బుధవారం సాయంత్రం కోర్టుకు తరలిస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

అరెస్ట్ అయిన వారిని పరామర్శించిన మాజీ మంత్రులు: వైసీపీ నాయకులు ఐదుగురిని అరెస్ట్ చేసిన సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, నిమ్మకాయల ఆదినారాయణ, కావటి మనోహర్ నాయుడు, దొంతిరెడ్డి వేమారెడ్డిలు మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు కలిసి వివరాలు తెలుసుకున్నారు. అంబటి రాంబాబు మాట్లా డుతూ అరెస్ట్ అయిన నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటూ న్యాయపరమైన పోరాటం చేస్తామన్నారు.

మంత్రిని కలిసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి

విశాలాంధ్ర-తెనాలి : రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కొర్ర విజయ లక్ష్మి మంత్రి కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. వైద్యశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించి జిల్లాలో ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని మంత్రి సూచించారు. జిల్లా డీపీఎంయూ డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్, జిల్లా ఉపవైద్యారోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఈరు గుల అన్నపూర్ణ, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ వేముల ప్రియాంక, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ హనీఫ్, డాక్టర్ మౌనిక కుమార్, డాక్టర్ బీబీ జాన్, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ మహిత, డాక్టర్ దేవికా వాణి, డాక్టర్ కిషోర్ కుమార్, అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర రెడ్డి, ఆరోగ్యవిస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, అధికారులు శ్రీకాంత్, ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి, వి.రవికుమార్ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

జీవనోపాధి కల్పించిన ఘనుడు రామోజీరావు

- ఈ నెల 7న వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రామోజీరావు సంస్మరణ సభ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కృష్ణా జిల్లాలోని పెదపారుమూడి గ్రామంలో ఓ సామాన్య రైతు కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగి అనేక సంస్థలు స్థాపించి వేల మందికి జీవనోపాధి కల్పించిన ఘనుడు చెరుకూరి రామోజీరావు అని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరెడ్డి, కన్న విద్యాసంస్థ అధినేత కన్న మాష్టార్, ప్రైవేట్ విద్యా సంస్థల రాష్ట్ర కో చైర్మన్ మేకల రవీంద్రబాబులు కొనియాడారు. బుధవారం స్థానిక రామన్నపేటలో ఉన్న జనచైతన్య వేదిక రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. జనచైతన్య వేదిక, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్‌ల ఆధ్వర్య ంలో ఈ నెల 7న ఉదయం 10 గంటలకు మార్కెట్ సెంటర్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిర ంలో అక్షర యోధుడు దివంగత చెరుకూరి రామోజీరావు సంస్మరణ సభ జరుగుతుందని, ఈ సభకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీమంత్రి మండలి బుద్ధ ప్రసాద్, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు మహ్మద్ నజీర్ అహ్మద్, గళ్ళా మాధవి, మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ ఎస్.తులసిరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రిటైర్డ్ ఐఏఎస్‌లు డాక్టర్ పీవీ రమేష్, డాక్టర్ పి.కృష్ణయ్య, మాజీమంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్, ఏపీ బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జ్ పాతూరి నాగభూషణం పాల్గొని రామోజీరావుకు నివాళులర్పిస్తారన్నారు. ప్రపంచంలోనే అరుదైన ఫిల్మ్ సిటీగా రామోజీ ఫిల్మ్ సిటీని నిర్వహించటం శ్లాఘనీయ మని కొనియాడారు. రామోజీరావు తెలుగు ప్రజలకు రోల్ మోడల్ అని పేర్కొన్నారు. 7వ తేదీన జరిగే రామోజీరావు సంస్మరణ సభకు అధిక సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించాలని వారు వెల్లడించారు.

తిరుమలకు బయలుదేరిన అమరావతి రైతులు

విశాలాంధ్ర-తుళ్లూరు : అమరావతి రైతులు తుళ్ళూరు నుంచి తిరుమల దేవస్థానం వరకు మొక్కులు తీర్చుకోవడానికి బయలు దేరారు. సుమారు 120 మంది అమరావతి రైతులు మహిళలు వెళ్ళారు. ముందుగా తుళ్ళూరులోని శివాలయం, సాయిబాబా, అయ్యప్ప స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. రైతుల తిరుమల యాత్ర బస్సులను ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. దనేకుల సుబ్బారావు, దామినేని శ్రీనివాసరావు, కాటా అప్పారావు, బెంగళూరు సాంబశివరావు, జేఏసీ సభ్యులు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

విశాలాంధ్ర- తెనాలి : గత ప్రభుత్వం విస్మరించిన కళాకారుల గుర్తింపు కార్డులు, పెన్షన్లను వెంటనే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన ప్రజానాట్యమండలి కళాకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ అధ్యక్షత వహించారు. ఆరేటి మాట్లాడుతూ జానపద, పౌరాణిక, సాంఘిక, ఔత్సాహిక కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ప్రజలను చైతన్యపరచేందుకు కళా రూపాలు అవసరమని గ్రామ గ్రామాన ప్రదర్శనలిచ్చి ప్రజలలో మార్పు తీసుకు రావాలని ప్రభుత్వం పూనుకొని కళా సంస్థలకు కళాకారులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. కళా ప్రదర్శనలకు బస్సులలో రైల్వేలలో రాయితీలు కల్పించాలని కోరారు. గతంలో నాటిక ప్రదర్శనలకు వెళ్ళే కళాసంస్థలకు రాయితీ లిచ్చే వారని, వాటిని తొలగించినందున మరలా వాటిని పునరుద్ధరించాలన్నారు. ఈ నెల 7వ తేదీ ఉదయం 10.00 గంటలకు గుంటూరు కార్యాలయంలో జరిగే జనరల్ బాడి సమావేశంలో అధిక సంఖ్యలో కళాకారులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా సమితి సభ్యులు దేవరపల్లి నీలాంబ్రం, ముక్కాల మాణిక్యారావు, విజయదుర్గ, విజయలక్ష్మి, వీణా పాల్గొన్నారు.

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కలిసిన జాస్తి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్య క్షులు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నిని ఆమె చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సర్పంచులు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఉప సర్పంచ్‌లు వివిధ కారణాల వల్ల క్యాజువల్ ఖాళీలు ఏర్పడ్డాయని, అయితే ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 13-ఏ ప్రకారం ఉన్నటువంటి ఖాళీలకు 120 రోజుల్లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా నేటి వరకు ఎన్నికలు నిర్వహించలేదని ఆయన సాహ్నీకి తెలియజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ ఎంపీటీసీ చిలకా వెంకటేశ్వర్లు, మాజీ ఉపసర్పంచ్ చిలక ఆనందరావు, సీహెచ్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి : కలెక్టర్

- జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ

విశాలాంధ్ర-గుంటూరు : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులుపై ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అన్నారు. బుధవారం పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం తయారు చేసిన కిచెన్‌ను పరిశీలించారు. విద్యార్థులకు వండిన భోజన నాణ్యతను స్వయంగా తిని కూరలోని కూరగాయలు మరింతగా ఉడికించి ఉంటే బాగుండేదన్నారు. అదేవిధంగా స్కూల్ లోని 5వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులతో మమేకమై జిల్లా కలెక్టర్ టీచర్‌గా మారి కొంత సమయం వారితో ముచ్చటిం చారు. ఇంగ్లీష్ పాఠ్య పుస్తకం చదవటంలో విద్యార్థికి ఉన్న ప్రతిభను పరిశీలిం చారు. 5వ తరగతి విద్యార్థి ఇంగ్లీష్ పాఠ్యాంశాన్ని చదివిన అనంతరం దాని అర్థాన్ని వివరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. అందుకు విద్యార్థి అర్థాన్ని వివరించ లేక పోవడంతో ఇంగ్లీష్ పాఠాన్ని చదవటంతో పాటు వాటి అర్థాన్ని కూడా తెలుసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్ వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి అంగన్‌వాడీలో ఉన్న చిన్నారులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమం లో తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్య నారాయణ, ప్రత్యేక అధికారి గ్రౌండ్ వాటర్ డీడీ వందనం, డీఈఓ శైలజ, సమగ్ర శిక్ష అడిషనల్ కో ఆర్డినేటర్ విజయలక్ష్మీ, మామిళ్లపల్లి గ్రామం సర్పంచ్ జాలాది యానాదిరావు, ఎంఈఓలు ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

సాహిత్యరంగ నామినేట్ పదవులలో అనుభవం ఉన్నవారినే నియమించాలి

విశాలాంధ్ర-గుంటూరు : కొత్తగా ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాహిత్యరంగానికి సంబంధించి త్వరలో భర్తీ చేయనున్న నామినేట్ పదవులను ఆయా శాఖల్లో అనుభవం ఉన్నవారినే ఎంపిక చేయాలని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరింది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, తెలుగు అకాడమి, అధికార భాషా సంఘం, గ్రంథాలయ పరిషత్ తదితర సాహిత్యరంగానికి చెందిన శాఖల్లో నియమించే రాష్ట్ర ఛైర్మన్‌లు, జిల్లా ఛైర్మన్‌లు, సభ్యులను సాహిత్యేత రులతో కాకుండా ఆయా రంగాల్లో జాతీయ స్థాయిలో విశేష అనుభవం ఉన్నవారినే ఎన్నుకోవాలని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం సూచించింది. అలాగే కవులు, రచయితలు, కళాకారులకు ఇచ్చే ఉగాది పురస్కారాలు, కళారత్నా అవార్డులు ఇవ్వడం కొనసాగించాలని, గత ప్రభుత్వం వీటిని విస్మరించడం వల్ల సాహిత్యరంగంలో నిరుత్సాహం నెలకొందని తెలిపింది. గత ప్రభుత్వం కవులు, రచయితలు, ప్రచురణకర్తల నుంచి జిల్లా గ్రంథాలయ సంస్థలు పుస్తకాలు కొనుగోలు చేసాయని, కానీ రెండున్నర సంవత్సరాలు గడిచినా కొన్ని జిల్లా సంస్థల నుంచి లక్షలాది రూపాయల బిల్లులకు సొమ్ము విడుదల జరగలేదని, ఈ ప్రభుత్వం దీని తాలుకా సొమ్మును వెంటనే విడుదల చేయడంతో పాటు కొత్త పుస్తకాలు కొనుగోలు ప్రక్రియకు శ్రద్ధ చూపాలని సంబంధిత మంత్రిని విజ్ఞప్తి చేసింది. కవులు, రచయితల పుస్తకాలు ప్రచురించుకునేందుకు గతంలో లాగే భాషా సంస్కృతిక శాఖా ద్వారా ఆర్థిక సహాయం అందించేలా కృషి చేయాలని, అలాగే సాహిత్యరంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సంఘం కోరింది.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు : పొన్నూరు మండలం మాచవరం గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ సందర్శించి అక్కడి రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి పంట వేసుకోవడానికి రైతుల డిమాండ్ మేరకు ఎంటీయూ 1224, బీపీటీ 5204 రకం వరి విత్తనాలను రైతులకు ఈ సందర్భంగా పంపిణీ చేశారు. అనంతరం కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులను అందించారు. మరో 40 క్వింటాళ్ల అదనపు వరి విత్తనాల కోసం పై అధికారులకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని, అందిన వెంటనే రైతులకు పంపిణీకి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు తెలిపారు. అందుకు కలెక్టర్ ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ సుమలతతో చరవాణి ద్వారా మాట్లాడుతూ అదనంగా కోరిన వరి విత్తనాలు వెంటనే తెప్పించి రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. తొలుత పచ్చలతాడిపర్రులో 50 శాతం సబ్సిడీతో ఇచ్చిన పచ్చిరొట్టె విత్తనాలతో పండించిన పొలాన్ని వ్యవసాయ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ, ఏడీఏలు వెంకటరామయ్య, రామకోటేశ్వరి, విలేజ్ అగ్రికల్చర్ అధికారి సుమజ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలి

- హోం మంత్రికి విజ్ఞప్తి చేసిన గోళ్ళ అరుణ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్ర హోం, విపత్తుల శాఖల మంత్రి వంగలపూడి అనితను మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ళ అరుణ్ కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోళ్ళ అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని హోం మంత్రికి సూచించారు. అలాగే అట్రాసిటీ కేసులో స్టేషన్ బెయిల్ రద్దు చేయాలని కోరారు.

వైసీపీ కార్యకర్తలుపై దాడులు చేయటం హేయం

తూర్పు వైసీపీ సమన్వయకర్త నూరి ఫాతిమా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కనీసం నెలరోజులు గడవ కుండానే వైఎస్సార్‌సీపీ కార్య కర్తలుపై దాడులు చేయటం హేయమైన చర్య అని తూర్పు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త షేక్.నూరి ఫాతిమా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు బుధవారం నియోజకవర్గ పరిధిలోని 8వ డివిజన్ కార్పొరేటర్ యిర్రి ధనలక్ష్మి కుటుంబ సభ్యులుపై టీడీపీ నేతలు దాడి చేసిన ఘటనపై నూరి ఫాతిమా ధనలక్ష్మి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా నూతి ఫాతిమా మాట్లాడుతూ తమ పార్టీ నాయకులపై టీడీపీ నేతలు దాడులకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంజు మాన్ మాజీ అధ్యక్షులు కర్నూమా, కార్పొరేటర్లు యిర్రి ధనలక్ష్మి, చంటి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియాపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వర్షాకాలంలో వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ)డాక్టర్ విజయలక్ష్మి అధికారు లకు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం గుంటూరు డిఎంహెచ్‌ఓలోని సమావేశ ప్రాంగణం నందు మలేరియా సబ్ యూనిట్ అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లకు నెలవారి సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఇది వర్షాకాలం అయినందున మన చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత విషయంలో పంచాయతీలు మున్సిపాలిటీలతో సమన్వయంగా ఉండి పరిశుభ్రతను మెరుగుపరచుకునే దిశగా ఉండాలన్నారు. నీటి నిల్వలను ఎప్పటికప్పుడు నివారించుకోవాలని, ఫ్రైడేను డ్రైడేగా పాటించా లని సూచించారు. ఓపికి వచ్చిన పేషంట్లలో కనీసం 15శాతం మందికి రక్త పరీక్షలు నిర్వహించాలని, లేబరేటరీలో కావాల్సిన రీ-ఏజెంట్స్‌ను ఎప్పటికప్పుడు సమకూర్చుకోవాలని స్పష్టంచేశారు. ల్యాబ్ టెక్నీషియన్లు రిజిస్టర్లు, రిపోర్టులను అప్డేట్‌గా ఉంచుకో వాలని, సూపర్‌వైజర్లు కీటక జనిత వ్యాధుల నివారణ చర్యలు చేపట్టి దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ కేసులను గణనీయంగా తగ్గించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారులు రాజు నాయక్, ప్రభాకర్‌రెడ్డి, సబ్‌యూనిట్ అధికారులు దస్తగిరి, ఘంటసాల శ్రీనివాసరావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

వెండితెర ఘటోత్కచుడు ఎస్వీ రంగారావు

విశాలాంధ్ర-గుంటూరు : భారతీయ సినీ చరిత్రలో నిలిచిపోయే దిగ్గజ నటులలో ఎస్వీ రంగారావు ఒకరు అని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. ఎస్వీ రంగారావు జయంతిని పురస్కరించు కుని తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో కాపు హాస్టల్‌లో నిర్వహించిన ఎస్వీ రంగారావు జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ప్రభాకర్ మాట్లా డుతూ వెండితెర మీద నవరసాలు అత్యద్భుతంగా పండించిన గొప్ప నటుడ న్నారు. జానపదాలు, పౌరాణికాలు, చారిత్రాత్మకాలు, సాంఘికాలు అన్ని రకాల సినిమాల్లో నటించారన్నారు. ఈ కార్యక్రమంలో బలిశెట్టి విజయ్, రేపల్లె నవీన్, సోదా శివరాం, శేషం సుబ్బారావు, హాస్టల్ వార్డెన్ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి దివ్యాంగులు పాలాభిషేకం

విశాలాంధ్ర-తాడేపల్లి : విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో తెలుగుదేశం పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో మంగళగిరి నియోజకవర్గ దివ్యాం గుల అధ్యక్షులు పిన్నెబోయిన అజయ్ కుమార్ పలువురు దివ్యాంగులు బుధవారం స్థానిక పట్టణ టీడీపీ కార్యాలయం ఎదుట సీఎం నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. దివ్యాంగులు మాట్లాడుతూ గతంలో రూ.3 వేలు వస్తుండగా సీఎం చంద్రబాబు నాయుడు రూ.6 వేలకు పెంచారని కొనియా దారు. వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ జూలై నెలకు సంబంధించి రూ.4 వేలు, ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రూ.3 వేలు కలిపి మొత్తం రూ. 7వేలను సచివాలయ సిబ్బంది లబ్దిదారులకు అందజేశారని సీఎంకు కృతజ్ఞతలు తెలియ జేశారు. టీడీపీ తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి అద్దంకి మురళి, సింహాచలం, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

'కన్నా'ను పరామర్శించిన ఎమ్మెల్యే జూలకంటి

విశాలాంధ్ర-మాచర్ల : ఇటీవల కుడి చేతికి గాయమై శస్త్రచికిత్స చేయించు కున్న మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి బుధవారం పరామర్శించారు. గుంటూరులోని కన్నా నివాసానికి చేరుకుని ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి మాజీ మంత్రి కన్నాను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా నియోజకవర్గాల్లో సమస్యలు, చేపట్టనున్న పలు అభివృద్ధి పనులపై చర్చించుకున్నారు.

ఘనంగా బైక్ మోటారు మెకానిక్‌ల దినోత్సవం

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో లైమ్ సిటీ టూ వీలర్ మెకానికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా మోటారు బైకుల మెకానికుల దినోత్సవం నిర్వహించారు. మెకానిక్‌లు అందరూ ద్విచక్రవాహనాలపై భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌కి వినతిపత్రం అందించారు. అనంతరం వెంకట రత్న ఆటో గ్యారేజ్ వద్ద కేక్ కట్ చేసారు. ఈ సందర్భంగా మెకానిక్ అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ మెకానికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, ఇళ్ళపట్టాలు మంజూరు చేయాలని, ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సహాయం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిం, గౌరవ అధ్యక్షులు షేక్ సుభాని, పట్టణ అధ్యక్షులు టి.వెంకట్రావు, ఉపాధ్యక్షులు వీరాంజనేయులు, బాషా, బాజి, సెక్రటరీ చల్లా శేఖర్, కోశాధికారి టి.జయరాజ్, సహాయక కార్యదర్శి అలీసా, ప్రచార కమిటీ సభ్యులు షేక్ హాసన్ బాబా, ఇమాంసా, ఎగ్జిక్యూటివ్ నెంబర్ ఆదిమూలం ప్రవీణ్, జానీ, కమిటీ సభ్యులు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : బెస్ట్ అవైలబుల్ పాఠశాలలను పునరుద్దరించడం పట్ల ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక నుంచి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలుపుతున్నామని వేదిక కన్వీనర్ బి.శ్రీనునాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్ఆర్టీ సెంటర్‌లోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గిరిజన గురుకుల పాఠశాలలో గత ప్రభుత్వం ఏఎన్ఎంలను విస్మరిస్తే గిరిజన ఐక్యవేదిక ఫలితంగా ఏఎన్ఎంలను నియమించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్రంలో ఉన్న గిరిజన వసతి గృహాల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని వాటిపైన ప్రత్యేకమైన దృష్టి సారించాలన్నారు. వసతి గృహాల్లోను ఏఎన్ఎంలను నియమించాలని అన్నారు. గిరిజన నామినేటెడ్ పదవుల్లో మైదాన ప్రాంత వాసులకు అవకాశం కల్పించే విధంగా చూడాలన్నారు. గురుకుల పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల సీట్ల కొరతను సృష్టించి వారికి ఇష్టం వచ్చినవారికి సీట్లు కేటాయిస్తున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయని, అలాంటి పాఠశాలలపైన ప్రత్యేకమైన దృష్టిసారించి ప్రధానోపాధ్యాయులను సస్పెండ్ చేయాలని అన్నారు.

కుమారస్వామికి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-గురజాల: పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన కె.కుమార స్వామిని గురజాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు మందపాటి శ్రీనివాసరెడ్డి, అసోసియేషన్ సభ్యులు పూలమాల వేసి శుభాకంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు చల్లారామిరెడ్డి, ఎ.వి పూర్ణారెడ్డి, కెవీ నాగార్జున, బి.ఎన్.వి హనుమంతరావు, అనంతరామయ్య, రాధాకృష్ణమూర్తి, ఎ.శ్రీనివాస రావు కనకం ఆదినారాయణ, షేక్.జానీభాష, కలివేల ప్రభుదాసు, జె చెన్న కేశవరావు, కావూరి రామకృష్ణ, కత్తి చలమరాజు, కర్రా చిన కోటేశ్వరరావు, న్యాయవాది గుమాస్తాల సంఘం అధ్యక్షులు కర్రా గిరిబాబు, గడిపూడి ఆదినారాయణ తదితరులు పాల్గొని అభినందనలు తెలియజేశారు.

ఐటీఐ ప్రవేశానికి రెండో విడత దరఖాస్తులకు ఆహ్వానం

విశాలాంధ్ర-మాచర్ల : ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో 2024-25 సంవత్సరానికి రెండవ విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు కోరనున్నట్లు పల్నాడు జిల్లా కన్వీనర్, ఆర్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ఎస్‌వీ ప్రసాద్ బాబు కోరారు. బుధవారం ప్రసాద్ బాబు మాట్లాడుతూదరఖాస్తులకు ఐటి.ఏపీ.జివోవి.ఇన్ వెబ్‌సైట్ అందుబాటులో ఉందని, ఈ నెల 27వ తేదీ సాయంత్రం గంటల లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 25వ తేదీ లోపు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు రావలసి ఉందన్నారు. అభ్యర్థులకు 27, 28వ తేదీలలో కౌన్సిలింగ్ జరుగుతుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

జనార్దన్‌ని కలిసిన గంగాధర్

విశాలాంధ్ర-పెదకూరపాడు: జాతీయ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ శాసనమండలి సభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు టీడీ జనార్దన్‌ని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ మర్యాదపూర్వకంగా కలిసి తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపి పూలమాలలో దృశ్యాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద కేశవులు, కొర్రపాటి రఘురామయ్య, అమరేశ్వరపు వెంకాయమ్మ, షేక్ జరీనా, రాజారపు వెంకటశివ, మురళి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

విశాలాంధ్ర-అమరావతి: పెదకూరపాడు నియోజకవర్గన్ని ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తానని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. బుధవారం ఆయన అమరావతి మండలంలోని అధికారులతో కలిసి నియోజకవర్గంలో పర్యటించారు. అర్అండ్‌బి అధికారులతో కలిసి బ్రిడ్జిలు, రోడ్లను పరిశీలించి వాటిపై అధికారులను నివేదిక కోరారు. నియోజకవర్గ పరిధిలో రోడ్ల మరమ్మత్తులు, నిర్మాణంలో ఉన్నవి, నిర్మించాల్సిన బ్రిడ్జిలు త్వరితగతిన పూర్తిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు. అనంతరం అర్అండ్ బి మంత్రిని కలిసి నియోజకవర్గ రోడ్ల మరమత్తుల నిమిత్తం నిధులు విడుదల చేయాలని వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ ఏ ప్రాంత అభివృద్ధికైనా తొలి మెట్టు రోడ్ల నిర్మాణం అన్నారు. ఏ ప్రాంతమైనా వ్యవసాయ, వాణిజ్య, వ్యాపార పరంగా అభివృద్ధి చెందాలంటే రోడ్లు ప్రముఖ పాత్ర పోషిస్తాయ న్నారు. అందుకే తమ నాయకుడు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదర్శంతో మొట్ట మొదటిగా రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టారన్నారు. త్వరలో అధికారులం దరితో సమీక్ష సమావేశాలు నిర్వహించి దశలవారీగా అని రంగాల అభివృద్ధిపై దృష్టి సారిస్తామన్నారు.

రేషన్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రక్షాళన చేసి, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసే మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజీ అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో బాలాజి విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటికే ఈ దిశగా అస్తవ్యస్తంగా మారిన ప్రజా పంపిణీ వ్యవస్థను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసేందుకు ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సిద్ధం కావడం హర్షణీయమని వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రేషన్‌బియ్యం అక్రమరవాణాకు అడ్డులేకుండా పోయిం దని, పేదలకు అందాల్సిన బియ్యాన్ని పంపిణీ చేయ కుండానే బొక్కేసారని మండిపడ్డారు. అప్పట్లో అధికారులు కూడా రేషన్ బియ్యం మాఫియాను కట్టడి చేయలేక పోయారని వెల్లడించారు. దీంతో పాటు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పౌర సరఫరాల శాఖలో అవినీతి తారస్థాయికి చేరిందన్నారు. జిల్లాతో పాటు చిలకలూరిపేటలోనూ రేషన్ మాఫియా అగడాలు పెరిగిపోయాయని వెల్లడించారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో భ్రష్టుపట్టిన ప్రజాపంపిణీ వ్యవస్థను గాడినపెట్టే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందన్నారు. ప్రతినెలా పేదలకు అందించే రేషన్ సరకుల్లో అవకతవకలు, అక్రమాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయనుందన్నారు. కొత్త ప్రభుత్వంలో ప్రజాపంపిణీ వ్యవస్థ పూర్తిగా గాడిన పడుతుందని, అన్ని సరకులు ప్రతినెలా సక్రమంగా అందుతాయని బాలాజి ఆశాభావం వ్యక్తం చేశారు.

రైల్వే లైను సాధన కోసం ప్రతిఒక్కరూ కలిసి రావాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న చిలకలూరిపేటకు రైల్వే లైన్ ఏర్పడితే స్పిన్నింగ్, జిన్నింగ్, గ్రానైట్ వ్యాపారాలు అభివృద్ధి చెంది ఉద్యోగ అవకాశాలు మెరుగుబడటమే కాకుండా చుట్టుపక్కల గ్రామాలలో కూడా ఉపాధి ఏర్పడి చిలకలూరిపేట నియో జకవర్గ మొత్తం అభివృద్ధి చెందుతుందని టీడీపీ తెలిపారు. బుధవారం టీడీపీ నాయకులు రత్నారెడ్డి ఆధ్వర్యంలో రైల్వేలైన్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుభాని ఆధ్వర్యంలో చిలకలూరిపేట రైల్వేలైన్ సాధన కోసం చేస్తున్న ఉద్యమంలో ప్రతి కార్యక్ర మంలో మద్దతు ఇస్తామని, అలాగే రైల్వే లైన్ కోసం ప్రతిఒక్కరూ కలిసి రావాలని టీడీపీ నాయ కులు రత్నారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెజ్జం రవి, రైల్వే లైన్ సాధన సమితి సభ్యులు మల్లికార్జున్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర-తెనాలి : వైద్యరంగంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఉపకరణాల తయారీకి శ్రీకారం చుట్టిన ఎస్ ఫోర్ హెల్త్‌కేర్ బృందం అభినందనీయులని డి.శారద సరీస్ సొసైటి నిర్వాహ కులు ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ డి.శారద అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ ఫోర్ హెల్త్ కేర్ సొల్యూషన్స్‌ను ఆమె బుధవారం ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా డాక్టర్ శారద మాట్లాడుతూ కోవిడ్ సమయంలో రోగు లకు చికిత్స చేయడానికి అత్యవసర పరిస్థి తులకు అనుగుణంగా సరైన పరికరాలు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొన్నారని, ఆ సమయంలో రోగులు కూడా తీవ్రఇబ్బందులకు గురయ్యారని అన్నారు. రూరల్ ప్రాంతంలో తయారీ యూనిట్ అందుబాటులోకి రావడం విశేషం అన్నారు.వ్యవస్థాపకులు మంచికలపూడి సంపెంగరావు మాట్లాడుతూ తన తల్లి క్యాన్సర్ వ్యాధితో బాధపడి మృతి చెందారన్నారు. ఆ సమయంలోనే ప్రాణాలు కాపాడేందుకు వైద్యులకు అవసరమైన పరికరాలు అందుబాటులోకి తేవాలనే ఆలోచన వచ్చినట్లు చెప్పారు. ఆపరేషన్ థియేటర్లో వైద్యులు ఉపయోగించే సర్జికల్ గౌన్స్, మాస్కులు, బఫెట్ క్యాప్స్, బెడ్‌షీట్స్, పిల్లో కవర్స్, షూ కవర్స్ వంటివి అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. డాక్టర్ ప్రీతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో మ్యాను ఫ్యాక్చరింగ్ యూనిట్ పలు సవాళ్ళతో కూడకున్న అంశమని, దానిని అధిగమించిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ వల్లూరి రామారావు, డాక్టర్ మంచికలపూడి ఫ్లోరా అలీస్ గ్రేస్ వైద్యరంగంలో హెల్త్ కేర్ ప్రాధా న్యతను వివరించారు. మంచికలపూడి సుబ్బారావు, కె.పవన్ కుమార్, ప్రొప్రైటర్ ఎం.సరోజిని, సంస్థ వ్యవస్థాపకులు ఎం.రవికుమార్, ఎం.సంపంగిరావు, యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-మంగళగిరి : దేవస్థానం ఘాట్ రోడ్‌లో మొక్కలు నాటిన రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి నూతన కార్యవర్గం బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి నూతన కార్యవర్గం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఘాట్ రోడ్‌లో మొక్కలు నాటే సేవా కార్యక్రమాన్ని చేపట్టింది. శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట ఘాట్‌రోడ్ మార్గం డివైడర్‌లో ప్రత్యేకంగా తెప్పించిన పెద్ద కదంబం మొక్కలను నాటారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవస్థానం కార్యనిర్వాహక అధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి హాజరు కాగా రోటరీ ఇంటర్నేషనల్ 3150 రోటరీ డిస్టిక్ పీడీజీ అనే రత్న ప్రభాకర్ మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు, క్లబ్ ట్రైనర్ ఇసునూరు అనిల్ చక్రవర్తి, కార్యదర్శి అందే మురళీమోహన్, కోశాధికారి వి.శ్రీనివాసరావు, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.సుందరయ్య, క్లబ్ ప్రెసిడెంట్ అందే రేవంత్, సి.గోపాలరావు, కేవీఎస్ ప్రకాష్‌రావు, ఏ.ఫణి కుమార్, కె.వేణుగోపాల్ తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. నూతన కార్యవర్గం ఇన్స్టాలేషన్ కార్యక్రమం ఈ నెల 14న లిటిల్ విలేజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముందుగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి రాజ్యలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అతిసార వ్యాధిపై ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర-కారంపూడి: మండలంలోని చింతపల్లి గ్రామ సచివాలయం నందు ప్రజలకు అతిసార వ్యాధి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై బుధవారం స్వచ్ఛ భారత్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ కె సుబ్బారావు మాటాడుతు సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు మరుగుదొడ్లను ఉపయోగించా లని సూచించారు. కూరగాయలను శుభ్రంగా కడిగి ఉడకబెట్టి తినాలని, క్లోరినేషన్ చేసిన నీటిని వాడుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలకు సంబంధించిన కరపత్రాలను, గోడపత్రికలను ఆవిష్కరించారు. హెచ్‌యస్‌వో నాయక్, ఏఎన్ఎం నిర్మల, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

విత్తన తయారీ కేంద్రాల తనిఖీ

విశాలాంధ్ర-రెంటచింతల: రెంటచింతల మిర్చి విత్తన తయారీ కేంద్రాన్ని పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ మురళి బుధవారం తనిఖీ చేశారు. మిర్చికాయల నుండి విత్తనాలు తీయటం, విత్తనాలను వేరు చేయు విధానాలను పరిశీలించారు. మొలకశాతం రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీలలో రవికుమార్, బ్రహ్మారెడ్డి, బ్రహ్మయ్య తదితరులున్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-వినుకొండ : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు బుధవారం దివ్యాంగు లకు 6000 పింఛన్ పెంపుపై నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన వినుకొండ పట్టణానికి చెందిన దివ్యాంగులు పటాన్ బాషా, వల్లపు శివ నాగరాజు, బాషా, వలి, మాదినేని శ్రీనివాసరావు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వినుకొండ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు మరియు నాయకులు పాల్గొన్నారు.

వెంకట హనుమయ్యను బొల్లా పరామర్శ

విశాలాంధ్ర-వినుకొండ : తెలుగు దేశం పార్టీ కక్ష్య సాధింపులకు గురై సబ్ జైల్లో ఉన్న ఇనుమేళ్ల గ్రామానికి చెందిన ఈపూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మెన్, నియోజకవర్గ వైస్సార్సీపీ సీనియర్ నాయకులు గోను గుంట్ల వెంకట హనుమయ్యని పరామర్శించిన వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మ నాయుడు, పార్టీ నాయకులు అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వారు ప్రజలు వారికీ ఇచ్చిన అధికారాన్ని కేవలం మాపార్టీ నాయకులపై కక్ష్య సాధించడానికే ఉపయోగిస్తు న్నారని, లోపల 75 సంవత్సరాల వయసు ఉన్న వెంకట హనుమయ్య ఆరోగ్య రీత్యా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయన ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వెంకట హనుమ య్యకి తగు వైద్యసేవలు అందించవలసిందిగా అధికారులను బొల్లా కోరారు.

'డెంగీని నివారిద్దాం-ప్రజారోగ్యాన్ని కాపాడుకుందాం'

విశాలాంధ్ర-బంటుమిల్లి :- డెంగీని నివారిద్దాం, ప్రజారోగ్యాన్ని కాపాడుకుందాం అంటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెద తుమ్మిడి వైద్యధికారి వి జయశ్రీ అన్నారు. డెంగీ నివారణ మాసోత్సవాలు కార్యక్రమంలో బాగంగా బుదవారం వైద్యాధికారి వి జయశ్రీ ఆధ్వర్యంలో మలేరియా, డెంగ్యూ, బోదకాలు వంటి జ్వరాలు రాకుండ అవగాహన మరియు నియంత్రణ చర్యలు చేపట్టడం జరిగింది అన్నారు. పి హెచ్ సి పరిధిలో ఉన్న అన్ని గ్రామాలలో ప్రతి రోజు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ. ఏడు కొండలరావు,హెల్త్ సూపర్ వైజర్ ఎం ఏసుదాసు, హెచ్ వి కమల రత్నం, ఎ ఎన్ ఎం స్వాతి ,హెల్త్ అసిస్టెంట్ యునస్, రాజారావు, సచివాలయం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

నేటి నుంచి సదరం బుకింగ్

విశాలాంధ్ర-కూచిపూడి : అంగవైకల్యం ధృవీకరణ పత్రాల కోసం గురువారం నుంచి సచివాలయాలలో సదరం స్లాట్ బుకింగ్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మొవ్వ ఎండిఓ.జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈనెల 4వ తారీఖు నుంచి ప్రారంభించే సాధన స్లాట్ శిబిరాలు సెప్టెంబర్ వరకు నిర్ధారణ పరీక్షలు జరుగుతాయని వివరించారు. దీనికోసం అర్హులైన లబ్ధిదారులు మీ సేవ, సచివాలయాలలో గాని ముందస్తుగా స్లాట్ నమోదు చేసుకోవాలని సూచించారు. మొవ్వ మండలం లోని 16 సచివాలయాలలో డిజిటల్ అసిస్టెంట్ ల వద్ద కానీ, సమీపంలోని మీ సేవ కేంద్రాల లోకానినమోదు చేసుకోవచ్చని దీనికోసం అవసరమైన ధృవపత్రాలు తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

హౌసింగ్ బిల్లులు విడుదల చేయాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : 2014 నుంచి 2019 టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించుకున్న గృహాలకు 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వం కక్షకట్టి హౌసింగ్ బిల్లులు ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు నిలుపుదల చేసి గత ఐదు సంవత్సరాలు ఇబ్బందులు గురిచేసిందని పల్నాడు జిల్లా ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు అద్దంకి బాబు మాదిగ అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పెద్దలు ఆలోచించి త్వరితగతిన బిల్లులు విడుదల చేయాలని కోరారు. ఆయా వర్గాలవారు గతంలో అనేక ఇబ్బందులుపడి అప్పులు తీసుకొని గృహాలు నిర్మించుకున్నారని వెల్లడించారు. గత వైసీపీ ప్రభు త్వంలో కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయారు. కనుక వెంటనే హౌసింగ్ బిల్లులు విడుదల చేసి పేద ప్రజలకు అండగా నిలబడాలని కోరారు.

సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా నర్రా సురేంద్రబాబు

విశాలాంధ్ర-శావల్యాపురం :మండలం కేంద్రం శావల్యాపురం సొసైటీ కార్యాలయంలో పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా నర్రా సురేంద్రబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన పాలక వర్గాన్ని ప్రభుత్వం రద్దు చేసి తాత్కాలికంగా పర్సన్ ఇన్‌ఛార్జ్‌లను నియమించింది. శావల్యాపురం సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా సురేంద్ర బాబును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు సొసైటీ సీఈవో జాలాది నాగ ప్రసాద్ తెలిపారు. బాధ్యతలు స్వీకరిం చేందుకు కార్యాలయాకి వచ్చిన సురేంద్రబాబును టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు గుంటూరు సాంబ శివరావు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సురేంద్ర బాబు మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందించి, సొసైటీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. టీడీపీ నాయకులు నలమాటి వెంకటేష్, మారినేని కొండలు, కాకాని వేణు, పత్తిపాటి కోటిలింగం పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-కారంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామ పెట్రోల్ బంకు వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు పంచాయతీ కార్యదర్శి భూతేశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యదర్శి తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తి గ్రామంలో మూడురోజులుగా తిరుగుతున్నాడని గ్రామస్తులు తెలిపారన్నారు. అతను బుధవారం మధ్యాహ్నం శవమై కనపడ్డాడని, వెంటనే పంచాయతీ కార్యదర్శికి ప్రజలు సమాచారం అందించారు. మృతదేహాన్ని పరిశీలించిన కార్యదర్శి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కె అమీర్ మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు మగమనిషి, అతని వయస్సు సుమారు 48 సంవత్సరాలు కలిగి గోధుమరంగు చొక్కా నలుపు రంగు ఫ్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. ఇతనిని గుర్తు పట్టిన వారు ఎస్ఐ ఫోన్ నెంబరు 9440796178 ను సంప్రదించాలని తెలిపారు.

ఆత్మహత్యకు అవకాశం ఇవ్వాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : ఆత్మహత్య చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కనిపిస్తున్న కారు గత మూడు రోజల నుంచి మాజీ సీఎం వైఎస్ జగన్ ఇంటి సమీపంలోని బకింగ్ హోమ్ కెనాల్ రోడ్డుపై నిలిచి ఉంది. తమ కుటుంబం ఆత్మహత్య చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కారుపై స్టిక్కర్ అంటించి ఉంది. రూ.16 కోట్లు తాము మోసపోయామంటూ న్యూస్ పేపర్ కటింగ్ కూడా కారుకు అంటించి ఉంది. ఎవరు ఎవరి వల్ల నష్టపోయారు, ఎందుకు నష్టపోయారు అనేది తెలియాల్సి ఉంది. మాజీ సీఎం జగన్ మంగళవారం బెంగుళూరు నుంచి తాడేపల్లిలోని తన ఇంటికి రావడంతో కారు సంఘటన ఈ ప్రాంతంలో కలకలం సృష్టించింది. దీనిపై తాడేపల్లి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

వలంటీర్ల ఉద్యమానికి మద్దతు

విశాలాంధ్ర-చిలకలూరిపేట : గతంలో రాజీనామా చేసిన వలంటీర్ల ఉద్యమానికి మద్దతునిస్తున్న ట్లు కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వర రావు(సంగమ్) తెలిపారు. సెక్షన్ 30, సెక్షన్ 144 పేరుతో వలంటీర్లు ఉద్యమాన్ని అణచివేయాలని చూడడం ప్రభుత్వానికి తగదన్నారు. ముఖ్యమంత్రి లేదా సంబంధిత శాఖ మంత్రిని కలిసి వారి విజ్ఞాపనను తెలియపరచు కునే అవకాశం కల్పించడం ప్రభుత్వం బాధ్యత అన్నారు. వలంటీర్లు తమ పార్టీ వారు కాదన్నట్లు ప్రభుత్వంలో ఉన్నవారు ఆలోచిస్తున్నారని ప్రభుత్వం పార్టీ వేరన్న విషయాన్ని గుర్తుంచుకోవటం అవసరమనిన్నారు. పార్టీకి ప్రభుత్వానికి మధ్య తేడా లేకుండా పోయిన నేపథ్యంలో ఉద్యమానికి సిద్ధపడ్డ వలంటీర్లు తమ విజ్ఞాపనను గవర్నర్‌కు తెలియపరిచే మార్గం చూడాలని ఆ వైపుగా ఆలోచించాలని రాజకీయాలకు సంబంధం లేని ఏ రాజకీయ పార్టీలో సభ్యత్వం కూడా ఉండకూడని పదవి గవర్నర్ అని పైగా గవర్నర్ రాష్ట్ర అధినేత అని ప్రథమ పౌరుడని కనక తమ విజ్ఞాపనను గవర్నర్‌కు తెలియపరిచే దిశగా గవర్నర్ భవన్ వైపు తమ పాదాలు కదపాలని ఆయన అన్నారు.

7న ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-పెదకూరపాడు: ఈనెల 7వ తేదీన పెదకూరపాడులోని ఆర్‌సీఎం ఎలిమెంటరీ స్కూల్ ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కేవిల్ రావు బుధవారం ప్రకటనలో తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గ పరిసర ప్రాంతాల ప్రజలు కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. పరీక్షలు నిర్వహించి శుక్లాలు గుర్తించి శంకర్ కంటి హాస్పటల్లో ఆపరేషన్ నిర్వహించి కళ్ళజోళ్ళు ఉచితంగా పంపిణీ చేస్తామని ఆయన అన్నారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

నేడు రుద్రాభిషేకం

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల పరిధిలోని 75 తాళ్లూరు గ్రామంలో అవధూత స్వామి ఆశ్రమంలో ఈ నెల 4వ తేదీన మహన్యాస రుద్రాభిషేకం శివుని రూపంలో పుట్ట మట్టితో శివలింగాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమం కమిటీ నిర్వాహకులు తాటి కోటేశ్వరమ్మ రామకృష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. వేద బ్రాహ్మణులు, ఆధ్యాత్మిక గురువులు పాల్గొని భక్తులచే భక్తిశ్రద్ధలతో గణపతి పూజతో ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న డ్రైనేజీల ప్రక్షాళన

విశాలాంధ్ర-అవనిగడ్డ : పంచాయితీ పరిధిలో డ్రైనేజి ప్రక్షాలన గత నాలుగు రోజులుగా నిర్విరామంగా కొనసాగుతుంది. అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ చొరవతో సీతాయలంకలో డ్రైనేజి సమస్య గమనించిన వెంటనే స్పందించి పంచాయితీ వారిచే 24 గంటల్లో మురుగు మళ్ళింపు చర్యలు చేపట్టిన మండలి బుద్ధప్రసాద్ సూచనల మేరకు పంచాయితీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు సీతాయలంక లోని డ్రైనేజి పనులను బుధవారం కూడా ఈఓ పర్యవేక్షణలోనే కొనసాగించారు.

పాస్‌పోర్ట్ పోయినది

గుంటూరు జిల్లా, ప్రస్తుతం: పల్నాడు జిల్లా, పిడుగురాళ్ళ, ఏబిసి హైస్కూలు ఎదురు, డోరు నెం.1-3/1ఎ కాపురస్తులు **దొడ్డ గోవిందారెడ్డి గారి కుమారుడు దొడ్డ శ్రీకాంత్ రెడ్డి (సెల్: 7013288743)** అను నేను నా పేరిట గల పాస్‌పోర్ట్ నెం. **P3923368** ఒరిజినల్‌ను **ది.21-06-2024**న పిడుగురాళ్ల బస్టాండ్ నుండి ఇంటికి వెళ్ళుచుండగా పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.